క్లుప్తంగా

డీఎల్ పురంలో తాగునీటి సమస్యపై వినతి

నక్కపల్లి : మండలంలో డీఎల్ పురంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్టు ఎంపీటీసీ మాజీ సభ్యుడు గింజాల వెంకటరమణ తెలిపారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చానన్నారు. జలజీవన్ మిషన్ పనులు నత్తనడకన జరుగుతున్నాయన్నారు. జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న వారు తాగునీరు, వాడుకనీరు సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇక్కడ సుమారు 160 మంది ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారన్నారు. గ్రామంతో పాటు, జగనన్న కాలనీలో నీటి సదుపాయం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించినట్టు వెంకటరమణ తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం రూరల్ : మండలంలో బుధవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు అనకాపల్లి జిల్లా ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ కె.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మట్ట ధర్మవరం, మార్టూరు రోడ్, సాయి ప్రియా లేఅవుట్, జగనన్న కాలనీ, ఆర్ అండ్ ఆర్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వెంకటాపురం కూడలి, దిబ్బపాలెం, మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్, ఎస్‌టీబీఎల్ కాలనీ, అచ్యుతాపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

రీ-సర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: రీ-సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రీ-సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. రైతులకు ముందస్తు సమాచారం అందించడం ద్వారా సర్వేలో తప్పులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. మండల సర్వేయర్ రవీంద్రపాల్, ఆర్ఐ కృష్ణవేణి, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కాలినడకన దుర్గమ్మ కొండకు..



కాలినడకన కొండకు వెళ్తున్న భక్తులు

ఎస్.రాయవరం: విజయవాడ కనకదుర్గమ్మ కొండకు పలువురు భవానీ మాలధారణ భక్తులు ధర్మవరం గ్రామం మీదుగా సోమవారం కాలినడకన పయనమయ్యారు. యలమంచిలి మండలం గూండ్రుబిల్లి గ్రామానికి చెందిన ఐదుగురు మాలధారణ భక్తులు కాలినడకన అమ్మ కొండకు బయలుదేరారు. ఈ మేరకు కాలినడక వస్తున్న భక్తులకు ఆయా గ్రామాల మాలధారణ భక్తులు స్వాగతం పలికారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం



మోదీ, సీతారామన్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : జీఎస్‌టీ తగ్గించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు బీజేపీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడుబాబు ఆధ్వర్యంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రాజాన సన్యాసినాయుడు మాట్లాడుతూ నిత్యావసరాలు, ఆహార పదార్థాలపై జీఎస్టీ తగ్గించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బండారు నాయుడు, కర్రి వెంకటస్వామి నాయుడు, మట్టా సూకరాజు, పీలా శ్రీను, జోగినాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్య తలెత్తితే సహించం

ఎస్.రాయవరం: గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తితే సహించేది లేదని ఎంపీడీవో పి.మీనాకుమారి హెచ్చరించారు. మండలంలో పలు గ్రామాల్లో పర్యటించిన ఆమె పారిశుధ్య, సేవా మిత్ర సేవలను పరిశీలించారు. పెనుగొల్లు గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ధర్మవరం అగ్రహారం, పెదగుమ్ములూరు గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కలుపు తీస్తేనే గెలుపు

- వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి
- కలుపు నివారించకపోతే దిగుబడిపై ప్రభావం



సాగులో ఉన్న వరి చేను

కోటవురట్ల: ఆరుగాలం శ్రమించే అన్నదాతకు పంట చేతికొచ్చేంత వరకు అగ్నిపరీక్షలే. పంటను కాపాడుకోవడానికి నిరంతర పర్యవేక్షణతో పాటు సస్యరక్షణ చర్యలు తప్పనిసరి. వాతావరణాన్ని బట్టి పంటను పరిశీలిస్తూ సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి. తెగుళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వరిలో ప్రధానంగా కలుపు నివారణ కీలకమనే చెప్పాలి. కలుపును సకాలంలో నివారించకపోతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. వాతావరణాన్ని బట్టి సకాలంలో కలుపు నివారణ చేపడితే పంట నాణ్యత పెరగడమే కాకుండా దిగుబడి ఎక్కువ వచ్చే అవకాశం ఉంది. ఇటీవల కాలంలో రైతులు ఎక్కువగా వరిలో వెదజల్లు పద్ధతి పాటిస్తున్నారు. ఈ పద్ధతి వల్ల వరిలో కలుపు పెరిగే ప్రమాదం ఉంది. దీనిని నిర్లక్ష్యం చేస్తే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఉంది. వరిలో కలుపుతీత చేపట్టకపోతే వరికి చేరాల్సిన పోషకాలు, ఎరువులను ఇతర గడ్డి లాక్కుని పంట నాణ్యతను, దిగుబడిని నాశనం చేస్తుంది. అంతే కాకుండా తెగుళ్ల ఆశించి రైతుపై భారం పడే అవకాశం ఉంది. దాంతో ఎరువుల వినియోగం కూడా గణనీయంగా పెరిగిపోతుంది.

ఆలస్యంగా నాట్లు

ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగులో రైతులకు ఇక్కట్లు తప్పలేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు రైతులను అయోమయంలోకి నెట్టేశాయి. దాంతో చాలా మంది రైతులు సాగుకు స్వస్తి పలికారు. గతేడాది కంటే ఈ ఏడాది సాగు గణనీయంగా పడిపోయింది. సకాలంలో వర్షాలు పడకపోవడంతో వరినారు ఆలస్యమైంది. ఫలితంగా నాట్లు కూడా ఆలస్యమయ్యాయి. పాయకరావుపేట నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 23,950 ఎకరాలు కాగా.. ఈ ఏడాది 15,725 ఎకరాలలో వరినాట్లు వేశారు.

ఇవే కలుపు మొక్కలు

గడ్డిజాతిలో వివిధ రకాలనే కలుపు మొక్కలు అంటారు. వీటిలో ఊదర, తుంగ, వెడల్పాకు, ఏకవార్షిక గడ్డి జాతులు ప్రధానమైనవి. ఇవి అనుకోని అతిథిలా పంటలోకి చొరబడి పంటకు ఇచ్చే పోషకాలను లాక్కుని బలిసిపోతాయి. తద్వారా పంటకు పోషకాలు అందక దిగుబడిపై ప్రభావం చూపుతుంది. సాధ్యమైనంత వరకు వీటి నివారణ తప్పనిసరిగా చేపట్టాలి. ఇందుకోసం వ్యవసాయ శాఖాధికారుల సలహాలు, సూచనలు తీసుకుని తగు మోతాదులో క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి. గతంలో కలుపు తీతను కూలీల ద్వారా చేపట్టేవారు. వరి నారు వేశాక వివిధ దశల్లో కలుపు నివారణ చేసేవారు. కూలీల కొరత రావడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మార్కెట్‌లోకి కలుపు నివారణ కోసం అనేక రసాయనాలు వచ్చేశాయి. అవగాహన లేకుండా పబ్లిసిటీ మాయలో చిక్కుకుని ఇష్టానుసారంగా ఏది పడితే అది పిచికారీ చేస్తే దుష్ఫలితాలు కలిగే ప్రమాదం ఉంది. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ తగిన మందును సకాలంలో మోతాదు ప్రకారం పిచికారీ చేస్తే కలుపు నివారణ జరిగి పంటలో దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

మందుల వినియోగం ఇలా..

కలుపు రాకుండా ముందస్తుగా వరి నాట్లు వేసిన కొత్తలో 500 మి.లీ ప్రెటిలాకోర్ కలుపు ద్రావణాన్ని నీటిలో కలిపి పంట తడిచేలా పిచికారీ చేయాలి. రెండు నుంచి నాలుగు ఆకుల దశలో 8 గ్రాముల పెట్ సల్ఫ్యూరాన్ లేదా క్లోరిమ్యూరాన్ ఈథేల్ మందును పిచికారీ చేయాలి. కలుపు ఎక్కువగా కనిపిస్తే 900 మి.లీ పెనాక్సులం లేదా సైహాలోపాస్ బ్యూటైల్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఇలా చేస్తే అన్ని రకాల కలుపు మొక్కలు నాశనమవుతాయి. కలుపు నివారణలో ఎప్పుడూ ఒకే రకం మందులను వినియోగించినా మంచి ఫలితాలు రావు.

మండలం	సాగు విస్తీర్ణం
పాయకరావుపేట	4,900 ఎకరాలు
నక్కపల్లి	3,125 ఎకరాలు
ఎస్.రాయవరం	4,500 ఎకరాలు
కోటవురట్ల	3,200 ఎకరాలు

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కలుపు నివారణను నిర్లక్ష్యం చేయకూడదు. కలుపు నివారణకు యాజమాన్య పద్ధతులను అవలంబించాలి. నాట్లు వేసినప్పటి నుంచి కలుపుపై ఓ కన్నేసి ఉంచాలి. కలుపు కనిపిస్తే సకాలంలో తగు మోతాదులో తగిన మందును పిచికారీ చేయాలి. లేదంటే పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

– బి.సరోజిని, మండల వ్యవసాయాధికారి, కోటవురట్ల

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- వై.లోవలో 90 మంది బాధితులకు అండగా ఉంటాం
- శారదా నదిపై వంతెన నిర్మాణానికి కృషి
- బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ సభలో ధర్మశ్రీ



రాంబిల్లి మండలంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి(అచ్యుతాపురం): ప్రస్తుతం ఎన్నికలు లేకపోయినా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. రాంబిల్లి మండలం వై.లోవ, పెదకలవలాపల్లి, నేవీ కాలనీలో సోమవారం రాత్రి నిర్వహించిన బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక సమస్యలపై తాము పోరాడతామని తెలిపారు. వై.లోవ పరిధిలో ఇళ్లు నిర్మించుకున్న 90 మందిపై ఉన్న కేసులు ఎత్తివేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కొన్ని దశాబ్దాల నుంచి అందుబాటులో ఉన్న ఫారెస్ట్ లాండ్‌లో ఇళ్లు నిర్మించుకున్న లోవ బాధితులకు తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పెదకలవలాపల్లి వాసుల చిరకాల డిమాండ్ అయిన శారదా నదిపై బ్రిడ్జి విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నేవీ కాలనీ వాసులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. యూరియా కొరతను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరోగ్యశ్రీని అటకెక్కించే ఈ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను తిప్పికొడతామని, మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శిరీష శ్రీనుబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కిశోర్ రాజు, కొవిరి రామకృష్ణ, బద్ది నారాయణరావు, ఎలమంచిలి కనకారావు, మడగల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వై.లోవ, పెదకలవలాపల్లి, నేవీ కాలనీ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తొమ్మిదో రోజుకు మత్స్యకారుల నిరాహార దీక్ష



రాజయ్యపేటలో కొనసాగుతున్న నిరాహార దీక్ష

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలని కోరుతూ రాజయ్యపేటలో మత్స్యకారులు చేపట్టిన నిరాహార దీక్ష సోమవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ముందు ఆరు రోజుల పాటు టెంట్లు వేసేందుకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో మత్స్యకారులంతా మండు టెండలోనే దీక్ష కొనసాగించారు. తర్వాత అనుమతి ఇవ్వడంతో టెంట్లు వేసి దీక్ష చేపడుతున్నారు. ఈ సందర్భంగా దీక్షకు సంఘీభావం ప్రకటించిన సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, మత్స్యకార నాయకులు ఎరిపల్లి నాగేశు, సోమేష్, పిక్కి తాతీలు తదితరులు మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్క్ వల్ల మత్స్యకారుల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడిందన్నారు. దీన్ని రద్దు చేయాలని కోరుతూ దీక్ష చేస్తే ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిత ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజయ్యపేట పర్యటనకు వచ్చిన హెటిరో డ్రగ్స్ వారు సముద్రంలోకి ఏర్పాటు చేస్తున్న పైపులైను గురించి మాట్లాడుతూ ఈ ప్రమాదకర కంపెనీల వల్ల మత్స్యకారుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని, కిడ్నీ, క్యాన్సర్ వంటి సమస్యల భారిన పడతారని ఆరోపించారన్నారు. ఈ కంపెనీలు వస్తే రాజయ్యపేట కనుమరుగవుతుందని, ముందు తరాల వారికి రాజయ్యపేట అనే గ్రామం ఇక్కడ ఉండేదని గుర్తు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ప్రమాదకర పరిశ్రమలకు మద్దతుగా మాట్లాడుతున్నారని వారు దుయ్యబట్టారు. అనితను నమ్మి ఓట్లేసి గెలిపించినందుకు తమను నట్టేట ముంచేశారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రోజూ వచ్చి ప్రాధేయపడ్డ అనిత తొమ్మిది రోజులుగా మేమంతా తిండి తిప్పలు మానుకుని నిరాహార దీక్ష చేస్తుంటే కనీసం పరామర్శకు కూడా రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యకారులు ఏం చేస్తారులే అనుకుంటున్నారని, ఎవరైనా సహనం కోల్పోతే పరిస్థితి వేరేలా ఉంటుందని హెచ్చరించారు. ఈ ఆందోళనలో మత్స్యకారులు బైరాగి, పిక్కి స్వామి, నానాజీ, రాంబాబు, మాధవ, కాశీ, దేముడు, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల శోభ



మిలట్రీ కాలనీలో ప్రతిష్ఠించిన అమ్మవారు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు



వేమగిరిలో ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

యలమంచిలి రూరల్: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు యలమంచిలి పట్టణం, మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవార్ల ఆలయాలు, ప్రత్యేక పందిళ్లు విద్యుద్దీపకాంతుల నడుమ కొత్త శోభ సంతరించుకున్నాయి. మొదటి రోజు అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఎంపీడీవో ఆఫీసు వీధిలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉత్సవాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించి తొలిరోజు బాల త్రిపురసుందరి అవతారంలో అలంకరించారు. దిమిలి రోడ్డు వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక్కడ చార్టర్డ్ అకౌంటెంట్ బండారు సత్యబంగారుశెట్టి దంపతులు అమ్మవారికి 10,108 రూ.పది నాణేలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మిలట్రీ కాలనీలో వరుసగా 43వ సంవత్సరం అమ్మవారిని ప్రతిష్ఠించారు. వేద పండితుడు భాగవతుల సాయికుమార్ శర్మ భక్తులతో పూజలు చేయించారు. పలు చోట్ల దుర్గమ్మవారిని ప్రత్యేక పందిళ్లలో ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

మునగపాక: మండల వ్యాప్తంగా శరన్నవరాత్రి వేడుకల సందడి నెలకొంది. మునగపాకలో పలు చోట్ల అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, శ్రీధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు తదితరులు దుర్గాదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడి ఆవరణలో వేద పండితులు సోమశేఖరశర్మ నేతృత్వంలో హోమం చేశారు.

నక్కపల్లి: శరన్నవరాత్రులు వాడవాడలా ఘనంగా ప్రారంభమయ్యాయి. నక్కపల్లి, ఉపమాక, కాగిత, మనబాన వానిపాలెం, సారిపల్లిపాలెం గ్రామాలతోపాటు దేవవరం, వేంపాడు, ఉద్దండపురం, గొడిచర్ల, చినదొడ్డిగల్లు, నెల్లిపూడి, రేబాక, రమణయ్యపేట, గుల్లిపాడు, సీహెచ్ఎల్‌పురం, తీనార్ల, చీడిక దోసలపాడు, తదితర గ్రామాల్లో శరన్నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుతున్నారు. కాగితలో దుర్గాదేవి అమ్మవారికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. వందలాది మంది మహిళలు బోనం పట్టుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఉపమాక దుర్గాదేవి ఆలయం వద్ద కూడా పూజలు చేశారు. గ్రామాల్లో మండపాల వద్ద వివిధ రూపాల్లో ఉన్న అమ్మవారి విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. భవానీ మాలధారులు అమ్మవారి మండపం వద్ద పూజలు చేశారు.

ఎస్.రాయవరం: మండలంలో అడ్డురోడ్డు, ఎస్.రాయవరం, ధర్మవరం అగ్రహారం, వేమగిరి, జేవీపాలెం, దార్లపూడి, తదితర గ్రామాల్లో దుర్గమ్మ ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అడ్డురోడ్డులో అమ్మవారి ఆలయానికి నాలుగు వైపులా విద్యుత్ దీపాలంకరణ చేశారు.



కాగితలో అమ్మవారి బోనాలు ఊరేగిస్తున్న భక్తులు




మునగపాకలో సంతబయిలలో అమ్మవారిని దర్శించుకుంటున్న బొడ్డేడ ప్రసాద్, తదితరులు



మునగపాకలోని లింగరాయి గుడి ఆవరణలో హోమం చేస్తున్న భక్తులు

కొనసాగుతున్న యూరియా కష్టాలు



యలమంచిలి మన గ్రోమోర్ దుకాణం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వంలో రైతుల యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియాను సకాలంలో రైతులకు అందజేయడంలో ప్రభుత్వం విఫలం కావడంతో ఎక్కడ చూసినా యూరియా బస్తాల కోసం రైతులు బారులు తీరి కనిపిస్తున్నారు. సోమవారం యలమంచిలి పట్టణంలో మన గ్రోమోర్ దుకాణం వద్ద యూరియా విక్రయిస్తున్నారన్న విషయం తెలుసుకున్న రైతులు బారులు తీరారు. ఉదయం 8 గంటలకు దుకాణం వద్ద వరుసలో నిల్చుంటే మధ్యాహ్నం వరకు వేచిచూడాల్సి వచ్చిందని రైతులు వాపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ తీసుకున్న పటిష్టమైన ప్రణాళిక కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కావాల్సినంత యూరియాను ఆర్బీకేల ద్వారా అందజేసిన విషయాన్ని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. మరో పు యలమంచిలి మండలంలో యూరియా కొరత లేదని, క్ మార్కెటింగ్‌కు, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మే అవకాశం లేకుండా చూస్తున్నామని మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహన్‌రావు తెలిపారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



తమ్మయ్యపేటలో నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

నక్కపల్లి: మండలంలో కంపెనీల కోసం భూములు త్యాగం చేసిన రైతులు, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆరోపించారు. కంపెనీలు వస్తున్నాయి.. సంబరాలు జరుపుకొందాం రండి అంటూ టీడీపీ నాయకులు విడుదల చేసిన ప్రకటనను నిరసిస్తూ సోమవారం సాయంత్రం తమ్మయ్యపేటలో నిర్వాసితులతో కలిసి నిరసన తెలిపారు. ఒక పక్క నిర్వాసితులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సక్రమంగా చెల్లించకపోగా కొత్త కంపెనీల ఏర్పాటుకు భూములు కేటాయించి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బల్క్‌డ్రగ్ పార్క్ కోసం నివాస ప్రాంతాలు కోల్పోతున్న కుటుంబాలకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించలేదన్నారు. నిర్వాసితులు రూ.25 లక్షలు డిమాండ్ చేస్తే కేవలం రూ.8.98 లక్షలు చెల్లించి చేతులు దులుపుకొన్నారన్నారు. లక్షకు రూ.10వేలు చొప్పున ఇన్‌కం ట్యాక్స్ కింద కోత విధించారన్నారు. తమ్మయ్యపేట, మూలపర, చందనాడ, బుచ్చిరాజుపేట, కొత్తూరు చందనాడ గ్రామాల నుంచి 745 కుటుంబాలను తరలిస్తున్నారన్నారు. ఈ కుటుంబాల్లో మేజర్లకు ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. నిర్వాసితులను ఇంకా మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు. టీడీపీ నాయకులు ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలోకి వచ్చేక మరోలా వ్యవహరిస్తున్నారన్నారు. మంత్రి అనిత సైతం మాట మార్చారని ఆరోపించారు.

కలుషిత మాంసం విక్రయిస్తే చర్యలు



మాంసం అమ్మకందారులతో మాట్లాడుతున్న అధికారులు, నాయకులు

పాయకరావుపేట: గ్రామాల్లో కలుషిత మాంసం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. మంగవరం గ్రామంలో ఆదివారం ఉద్దండపురం యేసు, గొర్ల కొండయ్య ఇద్దరూ కలిసి మాంసం అమ్మకాలు సాగించారు. గ్రామానికి చెందిన కోనే రామకృష్ణ మాంసం కొనుగోలు చేసి, వండి పిల్లలకు పెట్టారు. దీంతో వారు అస్వస్థతకు గురయ్యారు. దీనిపై బాధితుడు రామకృష్ణ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శిరీష, పోలీసు అధికారులు, వెటర్నరీ డాక్టర్ శరణ్య గ్రామంలో విచారణ చేపట్టారు. మాంసం విక్రయదారులను విచారించి హెచ్చరించారు. దీంతో వ్యాపారులు క్షమాపణలు చెప్పి, ఇకపై తాము గ్రామంలో మటన్ అమ్మకాలు చేపట్టమని, తమపై పెట్టిన పోలీసు కేసును ఉపసంహరించుకోవాలని ప్రాధేయపడ్డారు. దీంతో అధికారులు వ్యాపారులను హెచ్చరించి విడిచిపెట్టారు. ఈ సమావేశంలో సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, వీఆర్‌వో రాజేష్, గ్రామ కార్యదర్శి కొండలరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, కోనే పుత్రరావు, దేవవరపు నాగభూషణం పాల్గొన్నారు.

విద్యుత్ శాఖకు అపార నష్టం

- యలమంచిలిలో బీభత్సం సృష్టించిన గాలివాన
- 27 గంటల తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



పట్టణంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు పర్యవేక్షిస్తున్న ఏపీఈపీడీసీఎల్ అధికారులు

యలమంచిలి రూరల్: గాలివాన బీభత్సంతో యలమంచిలి పట్టణంలో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. 32 విద్యుత్ స్తంభాలు, 6 కిలోమీటర్ల మేర వైర్లు దెబ్బతిన్నాయి. ఆదివారం మధ్యాహ్నం 2.39 గంటలకు ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీని ప్రభావంతో పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ చెట్లు, కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడ్డాయి. ఎంపీడీవో కార్యాలయం వీధిలో నాలుగు స్తంభాలు నేలకూలి, వైర్లన్నీ తెగిపడ్డాయి. సౌభాగ్య అపార్టుమెంటు ఎదురుగా మిల్లు వద్ద భారీ వృక్షం వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.ప్రసాద్, అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్, యలమంచిలి ఏడీఈ సూర్యప్రకాష్, యలమంచిలి ఏఈ సిహెచ్.కనకరాజు సుమారు 100 మంది సిబ్బంది యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. సోమవారం విరిగిన విద్యుత్ స్తంభాలు, లైన్లను సరిచేశారు. యలమంచిలి పట్టణంలో పూర్తిస్థాయిలో అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడానికి సుమారు 27 గంటలకు పైగా సమయం పట్టింది.

ప్రజల బాధలు వర్ణనాతీతం

ఆదివారం మధ్యాహ్నం 2.40 గంటలకు గాలులతో కూడిన వర్షం ప్రారంభమైన వెంటనే నిలిచిపోయిన విద్యుత్ సరఫరా సోమవారం సాయంత్రం 6.30 గంటలకు పూర్తిస్థాయిలో పునరుద్ధరించారు. దీంతో ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాల్లో ట్యాంకుల్లో నీరు పూర్తిగా అయిపోయింది. వాడుకునేందుకు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా నీరు అందుబాటులో లేకపోవడంతో జనం తీవ్ర అవస్థలు పడ్డారు. ఇన్వర్టర్లు కూడా పనిచేయలేదు. అసలు విద్యుత్ సరఫరా ఎప్పటికి పునరుద్ధరిస్తారో స్పష్టత లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. కొందరు జనరేటర్లను గంటల లెక్కన అద్దెకు తెచ్చుకుని తమ ట్యాంకుల్లో నీళ్లను నింపుకొన్నారు. మరోవైపు తాగునీటికి కూడా నానా అగచాట్లు పడ్డారు. మినరల్ వాటర్ ప్లాంట్లు మూతపడడంతో తాగునీరు కూడా దొరక్క ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతం. 2014లో హుద్‌హుద్ తర్వాత చాలా మంది ఇళ్లలో కొవ్వొత్తుల వెలుతురులో జీవనం సాగించిన పరిస్థితులు కనిపించాయి.